క్లుప్తంగా

సేవాలాల్ దీక్షలు ప్రారంభం

లింగాపూర్: మహాశివరాత్రి పురస్కరించుకొని మండలంలోని భక్తులు 41 రోజుల ఉపవాస సేవాలాల్ దీక్ష స్వీకరించారు. గురువారం జగదంబా దేవి ఆలయంలో ఆలయ పూజారుల ఆధ్వర్యంలో దీక్ష తీసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ అంజల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో జరిగే అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని నంబాల, రెబ్బెన సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

'కాంగ్రెస్‌తోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి'



కాంగ్రెస్‌లో చేరిన యువకులతో నాయకులు

కౌటాల: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు అర్షద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌటాల ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, నాయకులు రత్నం సోమయ్య, డబ్బా బాపు, తిరుపతి, ఉద్ధవ్, భీమయ్య, సుధాకర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'ఆదిలాబాద్ ఎంపీ స్థానం కాంగ్రెస్‌దే'

బోథ్: ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోబోతుందని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. శుక్రవారం సొనాల గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులతో మాట్లాడారు. ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిలను కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు గాజుల పోతన్న, లోలపు పోశెట్టి, సుధీర్, సిర్పూర్ మహేశ్, జావిద్, అబూద్, తదితరులు పాల్గొన్నారు.

ఫీడింగ్ రూమ్ ప్రారంభం

చెన్నూర్: చంటిపిల్లలకు పాలిచ్చే గదులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫీడింగ్ రూమ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు ఫీడింగ్ గదిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, వృద్ధాశ్రమ అధ్యక్షుడు సత్తయ్య, సామాజిక సేవకులు ఉమారాణి, రాజబాపు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజమే

నేరడిగొండ: క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని నారాయణ్‌పూర్ (గౌలిగూడ) గ్రామ యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

దుస్తుల పంపిణీ

తలమడుగు: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రుయ్యాడి గ్రామానికి చెందిన జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి 300 మందికి శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. దాదాపు మూడు లక్షల విలువ గల దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. పేదలకు దుస్తులు పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. పండుగను పురస్కరించుకొని అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రకాష్‌రావు, వెంకన్న యాదవ్, పోతరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



దహెగాం: శివాలయంలో లఘు రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు



కెరమెరి: పల్లకి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



జిల్లాకేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పూజలు

హరహర మహాదేవ



కెరమెరి: అభిషేకం చేస్తున్న మహిళ



బెజ్జూర్: భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేస్తున్న అయ్యప్ప భక్తులు



తిర్యాణి: మొహింద రామశంకర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే సక్కు



వాంకిడి: పండ్లు పంపిణీ చేస్తున్న భక్తులు

జిల్లాలోని ఆలయాలు శుక్రవారం శివనామ స్మరణతో మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దహెగాం మండలం లగ్గాం గ్రామంలో గల ఉమాచంద్రశేఖర స్వామి ఆలయంలో 108 కలశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలో అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి గణపతిపూజ, లఘున్యాసపూర్వక రుద్రాభిషేకం, సుబ్రమణ్య అష్టోత్తర శతనామావళి, మంగళహారతి, మహామంత్రపుష్పం నిర్వహించారు. కెరమెరి మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామి పల్లకి ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. కౌటాల మండలంలోని తాటిపల్లి గ్రామంలో గల శ్రీసిద్ధి హనుమాన్ మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తిర్యాణి మండలం మొహిందా గ్రామంలోని రామశంకర శివాలయాన్ని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు దర్శించుకున్నారు. పెంచికల్‌పేట్ మండలంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం, ఎల్కపల్లి, చేద్వాయి శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వాంకిడిలోని శివకేశవ ఆలయానికి భక్తులు పోటెత్తారు. కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో ఎస్పీ సురేశ్‌కుమార్, ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ దంపతులు వేర్వేరుగా స్వామి వారికి పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో అన్నదానం, మజ్జిగ పంపిణీ, బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ, సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంచినీరు పంపిణీ చేశారు. సాయంత్రం ఎమ్మెల్యే హరీశ్‌బాబు దంపతులు శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌రూరల్: పూజలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ దంపతులు



ఆసిఫాబాద్: ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో పూజలో పాల్గొన్న ఎస్పీ సురేశ్ కుమార్



కాగజ్‌నగర్‌రూరల్: కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానం



వాంకిడి: జాతరకు పోటెత్తిన భక్తజనం



ఆసిఫాబాద్: బూర్గుడలో రథం లాగుతున్న భక్తులు



జైనూర్: పట్నాపూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



కెరమెరి: నృత్యం చేస్తున్న భజనా మండలి సభ్యులు



లింగాపూర్: శివలీలామృత‌గ్రంథం పారాయణం చేస్తున్న భక్తులు



ఆసిఫాబాద్‌అర్బన్: స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు



దహెగాం: లగ్గాంలో 108 కలశాల పూజలో పాల్గొన్న భక్తులు



కౌటాల: తాటిపల్లి జాతరకు ఎడ్లబండ్లపై వస్తున్న భక్తులు



కౌటాల: తాటిపల్లి జాతరలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



రెబ్బెన: జీఎం రవిప్రసాద్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కాగజ్‌నగర్‌రూరల్: మంచినీరు అందిస్తున్న నాయకులు

ఘనంగా మహిళా దినోత్సవం



బెజ్జూర్: మహిళలను సన్మానిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, నాయకులు మండోకార్ అనిల్, మల్లయ్య, జబోరె గణేశ్, రమేశ్, అరుణ, తుర్సా బాయి తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని కాంగ్రెస్ పార్టీ బెజ్జూర్ మండల అధ్యక్షుడు బూస శంకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలో మహిళలను సన్మానించారు. జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీ వర్ధన్, విష్ణుమూర్తి, మోర్లె గంగుమేర, దాసుయాద సంతోష్, బాబాజీ, దందేరా అంకుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఎదగాలి

ఆదిలాబాద్: మహిళలు ఆత్మ విశ్వాసంతో ఎదగాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసినీరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు స్వశక్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా కుంగిపోకుండా మానసిక స్థైర్యంతో దూసుకెళ్లాలన్నారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతుండటం గొప్ప విషయమన్నారు. అనంతరం కేంద్ర నిర్వాహకురాలు రేవతి బహెన్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, బ్రహ్మకుమారీలు, భక్తులు పాల్గొన్నారు.

మొక్కు చెల్లించుకున్న మాజీ సర్పంచ్

మందమర్రిరూరల్: చెన్నూర్ ఎమ్మెల్యేగా గడ్డం వివేక్ గెలుపొందితే నిలువెత్తు బెల్లం తులాభారం చెల్లించుకుంటానని చిర్రకుంట మాజీ సర్పంచ్ ఒడ్నాల కొమురయ్య మొక్కుకున్నాడు. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా జైపూర్ మండలంలోని వేలాల గట్టుమల్లన్నను దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే వివేక్ ఎత్తు బెల్లాన్ని తులాభారంగా చెల్లించుకున్నారు. వేలాల మల్లన్న మొక్కు తీర్చుకున్నందుకు కొమురయ్య సంతోషం వ్యక్తం చేశారు. వారి వెంట ఎమ్మెల్యే వివేక్ కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

ఆదిలాబాద్‌టౌన్: మహిళా హక్కుల సాధనకు ప్రతీ మహిళ ఉద్యమించాలని బాలికల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత అన్నారు. టీఎస్ యూటీఎఫ్, ఐద్వా, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో డైట్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి హాజరై మాట్లాడారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా, అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నారు. హక్కుల పరిరక్షణ ఉద్యమాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని, హరించుకుపోతున్న హక్కులను పోరాటాలతో సాధించుకోవాలని కోరారు.